ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.23.01.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తిరువనంతపురం-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ఈ రోజు కేరళలోని తిరువనంతపురంలో ప్రారంభించారు.
2. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026లో తెలంగాణ ప్రభుత్వం బహుళ అవగాహన ఒప్పందాల ద్వారా దాదాపు 30,000 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించింది.
3. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు.
4. వసంత పంచమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో సామూహిక అక్షరభ్యాసాలు నిర్వహిస్తున్నారు.

-----------------------------

**అమృత్ భారత్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తిరువనంతపురం-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ఈ రోజు కేరళలోని తిరువనంతపురంలో ప్రారంభించారు. దీనితో తెలంగాణకు మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ రైలుతో పాటుగా మరో రెండు అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు, ఒక ప్యాసింజర్ రైలును కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ రైలు ప్రతి మంగళవారం ఉదయం 7 గంటల 15 నిమిషాలకు చర్లపల్లిలో బయలుదేరుతుంది. మరుసటి రోజు మధ్యాహ్నానికి తిరువనంతపురం చేరుకుంటుంది. తిరిగి అదే రోజు సాయంత్రం 5 గంటల

30 నిమిషాలకు తిరువనంతపురం నుంచి చర్లపల్లికి బయలుదేరుతుంది. ఈ రైలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తుంది.

**PIB - DESK**

------------------------------

**TELANGANA - MoUs**

దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2026లో తెలంగాణ ప్రభుత్వం బహుళ అవగాహన ఒప్పందాల ద్వారా దాదాపు 30,000 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించింది. రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ప్రముఖ భారతీయ పారిశ్రామిక దిగ్గజం 'రష్మీ గ్రూప్'తో 12,500 కోట్ల రూపాయల పెట్టుబడితో కూడిన భారీ ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా వేలాది మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. కాలిఫోర్నియాకు చెందిన బ్లేజ్ సంస్థ హైదరాబాద్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న తన పరిశోధనాభివృద్ధి కేంద్రాన్ని విస్తరించడంపై దృష్టి సారిస్తూ ఒక ఒప్పందం కుదుర్చుకుంది. స్లోవేకియాకు చెందిన 'న్యూక్లర్ ప్రొడక్ట్స్' తెలంగాణలో 300 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన చిన్న తరహా న్యూక్లియర్ రియాక్టర్ ఆధారిత స్వచ్ఛ ఇందన ప్రాజెక్టును అభివృద్ధి చేయడానికి ఆసక్తి వ్యక్తం చేసింది. సుమారుగా 6,000 కోట్ల రూపాయల అంచనా పెట్టుబడితో దీనిని ఏర్పాటు చేస్తారు. వచ్చే మూడు నుంచి అయిదు ఏళ్లలో రాష్ట్రంలో అధునాతన తయారీ, పారిశ్రామిక వ్యవస్థల్లో 1,000 కోట్ల రూపాయల వరకు పెట్టుబడి పెట్టడానికి 'సర్గడ్' సంస్థ.. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది.

**MSL**

-------------------------

**గవర్నర్ పర్యటన**

సూర్యాపేట జిల్లాలోని మట్టపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ  అన్నారు.. సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గంలోని మట్టపల్లి క్షేత్రాన్ని ఆయన దర్శించుకున్నారు. అనంతరం మట్టపల్లి ఆలయానికి కొత్త సత్రం భవనం, కొత్త వంటశాల భవన నిర్మాణానికి గవర్నర్

శంకుస్థాపన చేశారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో 123 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న  ప్రభుత్వ వ్యవసాయ కళాశాల భవనానికి, కోదాడ నియోజకవర్గంలో 50 కోట్లతో నిర్మించనున్న  జవహర్ నవోదయ విద్యాలయం నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. గవర్నర్ వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ఉన్నారు.

**పీటీసీ - నల్గొండ**

---------------------

**బాలల హక్కుల పరిరక్షణ కమిషన్**

అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి 18 ఏళ్ల వయసున్న వారి సంరక్షణే ధ్యేయంగా బాలల పరిరక్షణ కమిషన్ పని చేస్తుందని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సీత దయాకర్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా చిన్నారులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలను పరిశీలించినట్లు చెప్పారు.

**బైట్ - సీతా దయాకర్ రెడ్డి**

**పిటిసి - కరీంనగర్**

----------------------

**మన ఇసుక వాహనం**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ ఇసుక నిర్వహణా వ్యవస్థను పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు.. జిల్లాలోని తహసిల్దార్లు, ఎంపిడివోలు, ఆర్డీవోలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ వ్యవస్థ పని విధానం, ఇసుక బుకింగ్ విధానం, రవాణా అనుమతులు, జీపీఎస్ ట్రాకింగ్, చెల్లింపుల విధానం, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియ వంటి అంశాలపై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్

మాట్లాడుతూ.. ఇకపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక సరఫరా పూర్తిగా 'మన ఇసుక వాహనం' ఆన్లైన్ సిస్టమ్ ద్వారానే జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ఆన్లైన్ సిస్టమ్ ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగంగా, నమ్మకంగా, అవినీతి రహితంగా ఇసుక లభ్యత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

**PTC-B. KGM**

------------------------

**ఖమ్మం కార్పొరేషన్**

ఖమ్మం పట్టణం విద్యా, వైద్య రంగాల్లో అగ్రస్థానంలో ఉందని, ఈ స్థాయిని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత పట్టణ ప్రజలపై ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ రోజు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని అర్బన్ ప్రైమరి హెల్త్ సెంటర్ ను మంత్రి ప్రారంభించారు. అనంతరం, మంత్రి మాట్లాడుతూ ఖమ్మంలో నివసిస్తే తమ పిల్లలకు మంచి విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యా వైద్య సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు..

**బైట్ - తుమ్మల నాగేశ్వరరావు**

**PTC, khammam**

------------------------

**కేటీఆర్**

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో ప్రజల దృష్టిని మళ్లిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. ఈ రోజు సిట్ విచారణకు హాజరయ్యే ముందు తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సింగరేణి కుంభకోణాన్ని ఎండగట్టినందుకే తమకు నోటీసులు ఇచ్చి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ విచారణ అంతా

టీవీ సీరియల్‌లా సాగుతోందని విమర్శించారు.. తాను ఎప్పుడూ అక్రమాలకు పాల్పడలేదని, చట్టంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు.

**బైట్ - కేటీఆర్**

కాగా ప్రస్తుతం కేటీఆర్ ను జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్లో సిట్ అధికారులు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రశ్నిస్తున్నారు.

**HYD -PTC**

-------------------------------

**అద్దంకి దయాకర్**

రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల వసూళ్ల కోసం, ఇతర పార్టీల నేతలను బెదిరించి చేర్చుకోవడం కోసమే గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే విషయాన్ని స్వయంగా మాజీ ఎమ్మెల్సీ కవితే చెబుతున్నారని ఆయన అన్నారు.. తెలంగాణను దోచుకున్న బంధిపోట్లు బీఆర్ఎస్ నేతలని, అందుకే వారి పార్టీ పేరు నుంచి కూడా తెలంగాణను తొలగించారని ఆక్షేపించారు.

**HYD -PTC**

------------------------

**ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్**

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బిఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్  విమర్శలు చేశారు. . ఫోన్ ట్యాపింగ్ అనేది దేశ రక్షణ కోసం పోలీసులు చేసే చట్టబద్ధమైన ప్రక్రియ అని, అన్ని ప్రభుత్వాల హయాంలోనూ ఇది జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో ట్యాపింగ్ తప్పు కాదని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక దానిపైనే కేసులు వేయడం హాస్యాస్పదమని విమర్శించారు.

**HYD -PTC**

--------------------------

**వసంత పంచమి**

రాష్ట్రవ్యాప్తంగా వసంత పంచమి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. వసంత పంచమి నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అందరికీ సరస్వతీ దేవి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు.

**వసంతపంచమి-జిల్లాలు**

రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో వసంత పంచమి వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.

ఆసిఫాబాద్ జిల్లాల్లో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

మంచిర్యాల జిల్లాలో పట్టణంలోని విశ్వనాథ ఆలయంలో వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు

నల్లగొండ జిల్లా అవంతిపురం సరస్వతీ ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సరస్వతి మాత ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

వరంగల్లోని చారిత్రక భద్రకాళి ఆలయాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

**పీటీసీలు - నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్లగొండ, నాగర కర్నూల్, వరంగల్**

---------------------------

**నాగర్ కర్నూల్**

నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీని అభివృద్ధి చేపట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద 3కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే 650పడకల ఆస్పత్రి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...

**బైట్: ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్**

**పీటీసీ - నాగర్ కర్నూల్**

-----------------------

**నేతాజీ సుభాష్ చంద్రబోస్**

ఈ రోజు స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పరాక్రమ దివస్‌గా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రముఖులు నివాళులు అర్పించారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతాజీ సేవలను స్మరించుకున్నారు.

**డెస్క్**

---------------------------

**సుభాష్ చంద్రబోస్**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నల్లగొండలో జనగణమన ఉత్సవ సమితి అయిదో వార్షికోత్సవంలో డీఎస్పీ శివరాం రెడ్డి పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు.

**పీటీసీ - నల్లగొండ**

-----------------------

**మేడారం - ప్రత్యేక రైలు**

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే భక్తులకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుంచి 28 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని, సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**పీటీసీ - మంచిర్యాల**

----------------------------